భిన్న స్వరాలు

గవర్నర్ పేట సెంటర్ లో హఠాత్తుగా రిక్షా ఆపమన్నాడు రిక్షాలో చేరగిలపడ్డ పాసెంజర్.

"ఏమండోయ్ రామారావుగారూ!" కేకేశాడు పాసెంజర్. బందర్ రోడ్డువైపుకి తలవంచుకుని వడివడిగా వెళ్ళే వ్యక్తి గతుక్కుమన్నాడు. మెల్లగా రిక్షావద్దకు వచ్చాడు తడబడే అడుగులతో.

సెంటర్ లో పోలీసు సంజ్ఞతో రిక్షా ప్రక్కనే వుండే అజంతా హోటల్ దగ్గర నిలువబడింది.

"ఏమిటీ! ఏమైనా తిరిగి యిచ్చేదంటూ వుందా!" కాస్త కటువుగా అన్నాడు రిక్షాలో వ్యక్తి, కాలినడకలో ఎక్కడికో పోతున్న రామారావుతో.

రామారావు నలువైపుల భయంగాను, సిగ్గుగాను చూచాడు. నెమ్మదిగా అన్నాడు. "ఇంకేనుందండి! రేపు ఫస్టున తప్పక తీర్చేస్తా! వెధవ ఖర్చులన్నీ అనుకోకుండా మీద పడ్డాయి. లేకుంటే యీ నెల్లోనే తీర్చి వుండేవాణ్ణి! ఈ ఒక్కసారి చూడండి నామాట." మెల్లగా అన్నాడు ఆయన కొక్కనికే వినపడేలా! రిక్షావాలాకి అస్పష్టంగానే వినిపించాయి రామారావు మాటలు!

"ఒక్కసారి కాదయ్యా డజన్ సార్లు చూచాను. ఇంకేం చూడమంటావు? ఓ నెల పెండ్లానికి జబ్బు. మరో నెల నీకు జీతనష్టమూ, ఇంకా నాయనగారి తద్దినమూ, మామగారి తిష్ఠ!!! ఇవన్నీ వినలేక చస్తున్నా. ఇదిగో..." గొంతు చించుకుంటున్నాడు రిక్షాలోని వ్యక్తి.

"కొంచం మెల్లగా మాట్లాడండి" తల వంచుకునే బిక్కుబిక్కుమంటూ అన్నాడు రామారావు.

"ఏమయ్యోవ్! నేనేమన్నా దొంగనేనుకున్నావా? భయపడటానికి; ఆ సిగ్గుఎగ్గులు నీకుండాలి! చిన్నగా మాట్లాడాలి! పది నాళ్ళనుంచి ముఖం చాటుచేస్తున్నావ్? పైగా అభిమానం."

చుట్టూ ఓ పాతికమంది జనం మూగారు. వింతగా చూస్తున్నారు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. రామారావు తల పైకెత్తితే ఒట్టు!

జనంలోనుంచి యెవరో ఇద్దరు మిత్రులు బయటికిపోతూ "ఎవరో ఎగేసేవాడిబాపతు రావోయ్!" అని ఒకరితో ఒకరంటూ వెళ్ళిపోతున్నారు.

"ఏమైనా, ఈనెల తీర్చేస్తానండీ గౌరయ్యగారూ! ఈ ఒక్కసారి క్షమించండి" రామారావు కండ్లలో నీరు గిర్రున తిరిగింది.

"అదీ చూస్తాను. చదువెందుకు కాల్చనా? తిన్న సొమ్ము తీర్చేదానికే ఏడుస్తే...పదరా" రిక్షా కదిలింది. రామారావు త్వరత్వరగా బందర్ రోడ్డువైపు నడిచాడు. రిక్షా ఏలూరు రోడ్డునపడిపోతోంది. ముసిరిన జనం పోలీసు యీలతో చెల్లాచెదురయింది.

బి. నాదమునిరాజు

2

గణగణ గణ్ గణ్ రిక్షా శబ్దం చేసుకుంటూ పోతోంది. నున్నటి సిమెంటురోడ్డుపైన దౌనులో కాబోలు చక్రాలు గిర్రు గిర్రున తిరుగుతున్నాయి. రిక్షాలాగేవాడి మెదడులో ఆలోచనలు గిర్రున తిరుగుతున్నాయి పాపం! ఎంత అభిమానపడ్డాడో ఆయన. ఎవరో గుమాస్తాలాగున్నాడు. ఏమిస్తారు జీతం?...ఆఁ! వందరూపాయలు రావచ్చేమో! ఎంత సంసారముందో! ముసిలి తల్లిదండ్రులు 'పెండ్లాం' యిద్దరు బిడ్డలైనా వుంటారు. రోజూ రెక్కలు ముక్కలు చేసుకుంటే రెండు మూడు సంపాదిస్తున్న నాకే చాలడంలేదే! అయినా మేం ముగ్గురమేగా! అందులోను చదువుకున్నోళ్ళు. మేము చార్ మీనారో, కారింజ బీడీలో తాగుతుంటామాయె. వారేమో కత్తెర మార్కయినా కాల్చుతారు. ఇంక కాఫీ...గుడ్డలు...ఇంటి బాడుగ...... ఏమోలే! ప్రపంచమంతా ఇంతే! పాపం! ఎప్పుడూ మాటపడ్డోడిలాగ లేడు. ప్రాణం పోయినట్టనిపించి వుంటుందేమో! ఆ మొఖం చూస్తావుంటే నా పేగులు వుడికిపోయినయి. మేమయితే తిట్లుతినటం అలవాటయినా పడినాము. తిట్లుతింటూ దండాలు పెట్టూ కాలాన్ని నెట్టుకపోతూ వుంటామాయె! ఏమో! ఈయన మాత్రం మనిషి కాదూ? చెట్టంత మనిషిని సెంటర్లో పట్టుకొని దులిపేశాడే! ఆయనంత బిక్కచస్తున్నా కనికరమైనా చూపాడుగాదు. ఎందుకు చేశాడో అప్పు యీయనదగ్గర. ఆ...ఎందుకోలే! సంసారమన్న తర్వాత అప్పుచేయకుంటే ఎలా గడుస్తుంది. అయినా కలిగినోళ్ళకు దయాదాక్షిణ్యాలుండవేమో! అవే వుంటే వేలూ లక్షలూ ఎట్లా సంపాదిస్తారులే! ఆ రామయ్యగోరు యింకా సిగ్గుతో చచ్చేకొద్దీ యీ గౌరయ్యగోరు మరీ నోరు పారేసుకోవడం...తూ, పాడు ప్రపంచం...గణగణ రిక్షా పరుగిడుతోంది.

3

రిక్షా పరుగిడుతోంది. గౌరయ్యగారి ఆలోచనలుకూడ పరుగుతీస్తున్నాయి రిక్షాతో పాటే! అయినా కాలం న్యాయస్థులది కాదు. బిడ్డకు జబ్బు చేసింది కుయ్యో మొర్రో అంటే యిరవైరూపాయలిచ్చానే! జ్ఞానం వుండొద్దూ? నాలుగు నెలలయింది. రూపాయకు అణా వడ్డీవస్తోందేఅనుకున్నా, కాలం ఎట్లాంటిది. అందులో యేదైనా వస్తువైనా ఖాతా పెట్టుకొనివుంటే సరిపోయేది. ముందు నాకు తెలివిలేదు. ముఖపరిచయాన్ని బట్టే అప్పులిచ్చే వాడెవడయినా వున్నాడూ? తియ్యని మాటలతో దగ్గరికివచ్చి తేలులా కాటేశాడు వెధవ! ఇస్తాడని నమ్మకమేముంది? ఈలా అవమానంచేస్తుంటే నన్నాయిస్తాడు. ప్రతి నెలా ఎదో ఒకసాకు నమ్మబలుకుతాడు. మాటలెవరికొక్కవాలనుకున్నాడో పాపం!

అయినా పాడుకాలం! పాడుబుద్ధులు! మంచంనిడివినిబట్టి కాళ్ళు చాచుకోవాలిగాని ఎగిరిపడతారు. ఒళ్ళు తెలీకుండా అప్పులు చేసుకొని లోకులచేత తిట్లూ, బెదిరింపులు బడుతూ ఎల్లా బ్రతుకుతాగో! ఏమీ ఇస్త్రీ బట్టలు వేసుకోకుంటే, నోట్లో సిగరెటు, కాఫీ, సినిమాలు; విఱ్ఱవీగుతూ వుంటారు గుమాస్తాలు. బ్రతకటమంటూ తెలీకపోతే ఏలానో! నేను కాబట్టి ఈమారుకూడ విడిచాను యింకెవరయినా అవుతేనా...?

డబ్బు డిమాండు బజారులో పెరిగిపోతోంది. ఇల్లాంటి చిల్లర అప్పులన్నీ వసూలుచేసుకుని యిప్పుడు మొత్తంగా పెద్ద లాభం పొందకుంటే యింక జన్మలో యిటువంటి ఛాన్సు దొరకదు. పాడు ముండాకాళ్లు అంతా యీలాగే! రాకుండా పోదుగాని అప్పుడు కొంత అప్పుడు

(౬౫-వ పేజీ చూడండి)

కాలక్షేపం

(7-వ పేజీ తరువాయి)

లేనప్పుడే రామరాజ్యంలో వారికి ఉన్నత గౌరవం ఉంటుంది. కాబట్టి శ్రీరామ రాజ్యంలో కూడా గౌరవంగలవాడే, గౌర్నమెంటుఉద్యోగి అనిపించుకోవాలి

బాపూజీ మనకు త్రోవ చూపించాడు. *He showed us the way*- అని పెద్ద అక్షరాలతో కాగితాలు అచ్చువేసి అంటించాము మనలను నడిపించిన నేత బాపూజీ నేత చూపించినదే నీతి కాని, నేతిలో ఎంత కల్తీఉందో నేడు నీతిలోకూడా అంత కల్తీ ఉంది. కల్తీ నేతి సరకు అమ్మడం కూడా నీతిమాలిన పని అని అంగీకరించాలి. మహాత్ముడు మనకు యిచ్చినది కల్తీలేని నేతిసరకు. చక్కని నీతిమార్గం చూపించాడు. కల్లు త్రాగవద్దు అన్నాడు. త్రాగించవద్దు అన్నాడు కాని, ఆ నీతిని కూడా కల్తీచేసి, పులియని కల్లు అనగా "నీరా" త్రాగితే తప్పు లేదనిచెప్పి, గాంధీ మహాత్మకీ జై! అని మహారాజులాగున నీరా త్రాగనీరా! అంటున్నారు.

ఇటువంటి కల్తీ నీతిని ప్రచారంచేయడం కంటె అపచారం యింకొకటి లేదు అవినీతిగా ప్రవర్తించేవాడుగాని, అవినీతి ప్రచారం చేసేవాడుగాని, ఆత్మహత్య అనేది ప్రత్యేకంగా చేసికోనక్కరలేదు. కొండమీదనుంచి క్రిందికి దూకనక్కరలేదు. పామునోట్లో చెయ్యి పెట్టనక్కరలేదు. మంటలలోదూకి, ఆహుతి కానక్కరలేదు. ఎంత చేసినవారి కంతయేగాని 'చింత ఏటికి రామ కృష్ణా' అనేమాట నిజము. గర్వించి కల్లు నెత్తిమీదకు వచ్చి కొండకొన ఎక్కిన వాడు కొండమీద నుంచి క్రిందకు పడ్తాడు. చూస్తూ చూస్తూ నిప్పులతో చెలగాటము ఆడేవాడు అగ్గిలో బుగ్గి అవుతాడు. విష సర్పములతో పయోముఖ విషకుంభములవంటి కల్మషబుద్ధులతో కలిసి కార్యకలాపములను సాగించెడి సాహసుడు ఆ విషమ విషతంత్రములలోనే విగతజీవులవుతాడు. అప్పుడు లోకం "అయ్యో! పాపం!"అనదు. "వాడిగతి అంతేకావాలి" అంటుంది. నీతిమాలి ప్రవర్తించడంకంటె, వాడు——

"ఉరుతర పర్వతాగ్రమునుండి
దృఢంబగు రాతిమీదన
త్వరముగ ద్రెళ్ళి కాయము
పాతంబుగ జేయుట మేలు"

అంటుంది

అవినీతి అతిశయించి, అంతశ్శుద్ధి ఆత్మతేజస్సు హరించి, ధాతువు క్షీణించి, ఆయువు మూడి, ప్రాణవాయువు వీడి, సంఘ కళేబరము క్రుళ్లి, పుచ్చి పురుగులు పట్టుచున్నప్పుడు, క్రిమిసముదాయ సంకులమై పూతిగంధ హేయమై దూష్యమైనప్పుడు, దానికి అంత్యపరిష్కారమైన అగ్ని సంస్కారము నొనర్చి, ఒక అంత్య నమస్కారం చేయాలి. అవినీతిని దహించెడి ఆ పవిత్రాగ్నిహోత్రము ప్రజాహృదయ క్షేత్రమునుండి ప్రజ్వలిస్తుంది. అదే ప్రచండ ప్రజావిప్లవాగ్ని కర్మపరతంత్రునకు అగ్నిపూజ్యమైనది. అది ఆర్యలోక ఆరాధ్యమైనది అట్టి ప్రజావిప్లవము వర్ధిల్లుగాక! ఇంక్విలాబ్ జిందాబాద్! ★

భిన్న స్వరాలు

(27-వ పేజీ తరువాయి)

కొంతవస్తే వుపయోగమేముంది? ఒక్కమొత్తంగావస్తే మంచి వడ్డీతో ఎవడికైనా పెట్టుబడికిస్తే ..

"అయినా యితగాడ్ని ఊరకపోనీరాదు. మెల్లగా మాట్లాడమంటాడు పైగా. అంత అభిమాన మేడ్చేవాడు విసరిపారేయరాదూ? అభిమానాలు . అభిమానాలయినా. ఏమిలేకున్నా ఈ నిక్కులతోనే నీల్గి గన్తూ వుంటారు రేపు ఫస్టున ఆఫీసువద్ద జీతమందినవాడు పట్టుకుంటే స్నేహితుల ముందర తేలుకుట్టిన దొంగలా యిచ్చేస్తాడు. ఆ అభిమానమే నిజమయితే అలా చేస్తేనే వాడు మనిషి...తూ...పాడు ప్రపంచం..."

"ఏయ్! ఆపు." రిక్షా ఆగింది. బేడ చేతిలో వేసి రిక్షావాడు 'బాబూ' అని మరేమో అనే లోగానే గౌరయ్యగారు తలుపు వేసుకొని లోనికెళ్లారు. వాకిటివైపు చురచుర చూసి రిక్షావాలా బజారు మార్గం పట్టాడు.

4

బందర్ రోడ్డున గబగబ నడుస్తున్న రామారావు తల పైకెత్తనేలేదు. మెదడు మెలికల్లో ఆలోచనా ప్రవాహం ముడిబడుతోంది పాడుబ్రతుకు! నాది ఒక బ్రతుకే! అంతమందిలో ఆ త్రాష్టునివల్ల మాటలు పడాల్సి వచ్చింది వాడికి డబ్బే బాకీ లేకుంటేనో! ఆ...ఎందుకంటాడు. వచ్చే జీతం తొంభయిఏడు. ఇంటి బాడుగ్గే పాతికపోతుంది మిగిలిందిదేనికి సరిపోతుంది. అయిదు మంది సంసారం. పెద్దపిల్లాడి చదువు ఛీ! చస్తేనన్నా బావుంటుంది ఇంట్లో పెండ్లాం బిగ్గలపోరు, వీధిలో అప్పులాళ్ల హడావిడి, ఆఫీసులో ఆఫీసర్ చిరబురలు! ఛీ! ఛీ!

అయినా యీలాంటి నీచుడివద్దర అప్పు చేయటం నాదే పొరబాటు. కాని ఏంచేస్తాను. పిల్లాడికి జబ్బు కమ్మి మంచంలో బడితే! వీడే దిక్కయ్యాడు. ఏం? పూరికేయిస్తున్నాడా? ఎన్ని నెలలయితే అన్ని యిరవై అణాలు చెవులు మెలేసి గుంజుకోడూ! అయినా సాహుకార్ల దౌర్జన్యం పోవాలి! వీళ్లున్నంత కాలం యింతే!

తోటి మనిషనన్నా భావించాడా? ధారాప్రవాహంగా ఆసుకవిలాగ బాణాలు గుచ్చాడు పాడువధవ అందరిలోను. వాడికీ నాలాంటి ఖర్మ పట్టకపోదు లే!

వీలయినంత త్వరలో వీడి డబ్బు విసిరి పారేయాలి ప్రతి నెలా అనుకుంటూనే వున్నాను. కాకుండా వుంది. పోయిన నెలేమో సుగుణకి జ్వరం.. జీతమే గాక అప్పుకూడా అయింది ఈ నెలేమో నాయన గారు క్రిందపడి కాలు బెణకడం ఖర్చుల పటమూ...అన్నీ యీలానే అవుతున్నాయి ఒక జత గుడ్డలు తప్ప వాకేమీ లేవు అవే ప్రతిదినమూ సుగుణ సన్లైట్ సబ్బుతో ఉతికి పెడ్తోంది. ఇంక ఆమె పని మరీ పాపం! రెండే రెండు చీరలు! అందులోను ఒకటి మెల్లబడింది ఇంక పిల్లలూ...పైగా బంధువులూ. ఛీ . ఛీ...

ఈ గౌరయ్యగాడి కొక్కడికే నయితే ఏలాగో యివ్వచ్చు. ఈలాంటి గౌరయ్యలు మరో పాతికమంది నెత్తిన కూర్చున్నారు. అయినా వీడికి పారేసి నాలుగు దులపాలి! కొంచమైనా మానవత్వమంటూ వుంటుందనుకున్నాడూ? ఆ గుంపులో తెలిసినవాళ్ళెవరైనా లేరుకదా కొంపదీసి! ఎవరైనా చూచివుంటే ఎంత అవమానం! వీడిపైన ఎలాగైనా కసి తీర్చుకోవాలి...మ్చ్. . ఏం చేయగలను నేను? తూ...పాడు ప్రపంచం.

'కిర్' కారుకు సడన్ బ్రేకు పడింది. "ఏమయ్యోవ్ తూగుతూ తూలుతూ నడుస్తున్నావా?" కండ్లనోగు లాంచి తీక్షణంగా చూస్తూ గదమాయించాడు కారు వోనర్.

ఇహ ప్రపంచంలో పడ్డ రావుకాళ్లు ఆఫీసుకి దారితీశాయ్. ★

కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, ..., సవాయి వ్యాధులకు గ్యారంటీ చికిత్స క్యాటలాగు ఉచితము సలహాకు జి. వి. రెడ్డి & కో. (రిజిష్టర్డు)

"శాస్త్ర రక్షమము"

గోపాలపురం తూర్పుగోదావరి